# ప్రజాస్వామ్య స్థాపనార్థాయ..

## స్వామి చిత్రానంద

ప్రజాస్వామ్య స్థాపనార్థాయ
సంభవామి ఎన్నికే ఎన్నికే

అనుకున్న విధంగానే ఎన్నికలు అశాంతవాతావరణంలో జరిగినా, ప్రశాంతంగా ముగిశాయి. అన్ని కేంద్రాల్లోనూ ఓటర్లు వుత్సాహంతో పాల్గొన్నారు. అధికారులు ఆశించిన ముప్పైశాతంకన్న, మరో ఒకటిన్నర శాతం అధికంగానే ఓట్లు పడ్డాయి. చెదురుమదురుగా జరిగిన హత్యలను మినహాయిస్తే అల్లర్లు ఎక్కడా జరగలేదు. రాష్ట్రం మొత్తంమీద జరిగిన రెండురోజుల ఎన్నికల్లోనూ, మొత్తం జరిగిన హత్యలు పదిహేను. అక్షరాలా పదిహేను మాత్రమే.

వీరంతా ప్రభుత్వోద్యోగులు. వారంతా తమ తమ విధి నిర్వహణలో అశువులు కోల్పోయిన అమరజీవులు. వారి ఆత్మశాంతికీ, వారి కుటుంబ సభ్యుల సానుభూతికీ ఢిల్లీ టి.వీ. కేంద్రం నుంచి జాతీయ కార్యక్రమంలో జాతీయ నాయకులంతా అశ్రుతర్పణ చేశారు. ప్రజాస్వామ్య స్థాపన కోసం వారు చేసిన త్యాగాన్ని అభినందించారు.

ప్రభుత్వం ప్రకటించిన 'మరణకానుకలు' ఆ అమర జీవుల వారసులకు వెనువెంటనే అందజేయబడు తున్నాయి. మృతదేహాలను వారసులు గుర్తు పడు తున్నారు. ప్రభుత్వాధికారులు ఇచ్చిన కాగితాలమీద చేయమన్న చోట చేయమన్నన్ని సంతకాలు చేస్తున్నారు. చిరునవ్వుతో అధికారులు ఇస్తున్న చెక్కును (అదే నగదు బహుమతి రెండు లక్షలు) విచారవదనాలతో అందుకుని సెలవు తీసుకుంటున్నారు. ఉద్యోగి మరణించినా, ప్రభుత్వ దృష్టిలో అతను సజీవుడే-ఉద్యోగం చేస్తున్నట్టే. నెలనెలా అతనికి రావలసిన జీతం అతని వారసులకు అందచేయబడుతుంది-అతను రిటైర్ అయ్యే తేదీ వరకూ.

ఇలా మొత్తం పధ్నాలుగు మృతదేహాలను వారివారి ఆత్మీయులు గుర్తుపట్టి నగదు బహుమతి తీసుకుని, రాజ లాంఛనాలతో, ప్రభుత్వ ఖర్చుపై మృతదేహాలకు అంత్య క్రియలు చేశారు. అస్థికలను భక్తితో తమతమ గ్రామాలకు తీసుకువెళ్ళారు.

మిగిలిన ఆ పదిహేనో నెంబరు మృతదేహాన్ని కూడా ఎవరైనా తీసుకువెళ్ళితే, ఆ అధికారి శ్రీ యస్. కె.రావు గారు కృతకృత్యులైనట్టే! అందుకే పాపం ఆయన ఆ శవం దగ్గర కుర్చీలో కునికిపాట్లు పడుతూ పగలు కూడా 'శవ జాగారం' చేస్తున్నారు. ఎంత చలికాలమైనా, ఎన్ని మంచు గడ్డలు శవం చుట్టూ వుంచినా, దానిపై పన్నీరు చల్లినా, వెలుగుతున్న అగరువత్తులు చుట్టూ వుంచినా, దుర్గంధం తగ్గడం లేదు. అయినా ఆయన, ఆయన సహాయకులు ఓపిగ్గా వున్నారు.

భోరున ఏడుస్తున్న ఓ పాతికేళ్ళ అమ్మాయినీ, ఆమె ఇద్దరు కూతుళ్ళనూ తీసుకుని, ఓ మధ్య వయస్కుడు ఆ శిబిరానికి వచ్చాడు. మృతదేహాన్ని చూసాడు. ఆ దేహాన్ని చూస్తే పాపం అతనికి కళ్ళనీళ్ళు తిరిగాయి.

"వారే! వారే! మా వారే!" అంటూ భోరున ఏడుస్తూ, నేలమీద పడిపోయింది.

"ఊరుకోమ్మా ఏడ్చి ఏం ప్రయోజనం? మీవారిని, దేశానికీ, దేశంలోని ప్రజాస్వామ్య పరిరక్షణకీ అర్పించావు. అందుకు నువ్వు గర్వించాలి. నువ్వు వీర పత్నివి. మీకు ప్రభుత్వం యిచ్చే 'మరణ కానుక' తీసుకో. హాయిగా ఈ పిల్లలను పెంచి పెద్దవాళ్ళను చెయ్, వారికి పెళ్ళిళ్లు చెయ్. ఆయన జీతంతో సంసారాన్ని గడుపు" అని అధికారి యస్. కె.రావు ఆమెను ఓదార్చాడు.

"వారు లేని బతుకు బతుక్కాదు. నే బతకలేను. నే బతకను" అంది ఏడుస్తూనే

"వారు బతికుంటే రెండు లక్షలు సంపాదించ గలరా? జీతం రాళ్ళుగాక పైగా ఏమన్నా ఏరుకున్నా, సాయంకాలం బార్‌లో తాగేసి, తూలుతూ రాత్రి యింటికి చేరితే, రిక్షా డబ్బులుకూడా నువ్వే యివ్వాలి గదా? ఆయన మహానుభావుడు. త్యాగి. అమరజీవి పొట్టి శ్రీరాములు కోవకు చేరతాడు. ఆయన్ని తెల్సిన వాళ్లు తల్చుకుంటే విగ్రహం కూడా పెట్టుకోవచ్చు. బతికి వుండి మేం ఎవ్వరం సంపాదించలేనంత మొత్తం, సాధించలేనంత ఖ్యాతీ ఆయన గడించాడు. అది మావల్ల కాదు. నువ్వు అదృష్టవంతురాలివి వూరు కోమ్మా"- అని ఆమెను మరోసారి ఓదార్చి, పక్కనే వున్న అసిస్టెంట్‌ను పిలిచాడు అధికారి-

"వారి గుర్తులు, పుట్టుమచ్చలూ వగైరాలు అన్నీ సరిగ్గా తనిఖీ చెయ్. నేను ఈలోపుగా చెక్కు సిద్ధం చేయిస్తాను" అని లోపలకు వెళ్లాడు.

"అమ్మా! మీవారి పేరు?" అన్నాడు అసిస్టెంటు.

"మీ నాన్నగారి పేరు చెప్పవే" అంది పక్కనే వున్న చంటి పాపని-

"నాన్నగాలు" అంది చంటి పాప.

"భారతనారి భర్తపేరు చెబుతుందా?" అని అసిస్టెంటును మందలించాడు ఆమెతో వచ్చిన మధ్యవయస్కుడు.

"ఆ చేతిమీద చూడు-ఎస్. కె.రావు అని పుట్టు మచ్చ వుంటుంది."

"ఓ. కే.మృతదేహం పేరు ఎస్. కె.రావు.

మరో గుర్తు చెప్పమ్మా"

"కుడిబుగ్గ మీద కత్తినాటు"

"కుడిబుగ్గ మీద కత్తినాటు- ఓ. కే. మరొక్కటి-"

"ఉంగరాలజుట్టు-కుడి పాపిడి-"

"ఉంగరాల జుట్టు ఓ. కే కుడిపాపిడి ఓ. కే ఇంకొక్కటి చెప్పు"

"నడువుకు తోలుబెల్టు"

"ఓ. కే. ఓ. కే. నడుం బెల్టు ఓ. కే. ఇంకేం అక్కర్లేదు. ఈయన మీవారే" అని లోపల అధికారి దగ్గరకు వెళ్ళాడు అసిస్టెంట్.

"సార్! ఒకటికాదు-రెండుకాదు. మొత్తం నాలుగు గుర్తులు చెప్పారు సార్ అన్నీ కరెక్టుగా వున్నాయి సార్."

"అయితే ఆమెను లోపలకు రమ్మను" అన్నాడు అధికారి.

ఆమెను లోపలకు తీసుకువెళ్ళాడు అసిస్టెంట్.

" అమ్మా! ఇక్కడ సంతకం పెట్టు" అన్నాడు అధికారి. !

ఆమె ముందుకు కదల్లేక అక్కడే కుమిలి కుమిలి ఏడుస్తున్నది. ఆమె పక్కనవున్న పెద్ద మనిషి చలనం లేకుండా నిలబడివుండడం గమనించిన అధికారి-

"అయ్యా! మీరు ఆమెకు ఏమవుతారో తెలియదు. మీరామెను ఓదార్చడం బోయి, అలా నిలబడితే ఎలా? మా పనులు ఎలా అవుతాయి? రండి పెందరాలే మేమీ క్యాంపు ఖాళీ చేసి మా ఇళ్ళకి పోవాలి"అని అతన్ని మందలించాడు.

ఆ మధ్యవయస్కుడు ఆమెను తీసుకువెళ్లి, ఆమె చేత సంతకం చేయించాడు-అధికారి చూపించిన అన్ని కాగితాలమీదా, అన్ని చోట్ల.

"అయ్యా! మీరు సాక్షి సంతకం చేయండి."

ఆయన సాక్షి సంతకం చేశాడు.

"అమ్మా! మీరు కాస్సేపు అలా కూచోండి. ఫొటోగ్రాఫర్ రాగానే మీకు చెక్కు యిచ్చేస్తాను" అన్నాడు అధికారి.

కాస్సేపయినాక వచ్చిన ఫొటోగ్రాఫర్‌కి నవ్వుతూ పోజు యిచ్చి, చెక్కును ఆమెకు అందజేయడం మర్చి పోయాడు అధికారి.

"అయ్యా నేను ఫొటో తీసేశాను. మీరు చెక్కు

ఆమెకు ఇచ్చెయ్యండి" న్నాడు ఫొటోగ్రాఫర్.

చెక్కు ఆమెకు ఇచ్చాడు అధికారి.

"మరి- ఈ మృతదేహం?" అన్నాడు అధికారి 'మీరు తీసుకువెళ్ళరా?' అని ధ్వనించేట్టు.

"అయ్యా! మీరు కల్పించే రాచమర్యాదలూ, రాజ లాంఛనాలూ మేం ఎక్కడ సమకూర్చగలం?" అని చెక్కుని మాత్రం తీసుకొని వెళ్ళిపోయాడు ఆ మధ్య వయస్కుడు.

అతనికి ఎదురుగా వెళ్ళి, చాటుకు పిలిచాడు అధికారి.

" మామయ్యా మీరు చేసింది మహా పాపం" అన్నాడు ఎస్.కె.రావు.

"ఏవిట్రా పాపం? ఇన్నేళ్ళుగా నువ్వు ఓ కుర్చీకి అతుక్కుపోయి పనిచేస్తున్నావు. ఎవడైనా నీ నిజాయతీ గుర్తించాడా? ఇప్పుడేదో అవకాశం వచ్చింది. చిన్న నాటకం ఆడాం- నీ పేరు గలవాడే అక్కడ పడివున్న వాడు. వాడే నువ్వు అన్నాం-చెక్కు తీసుకొచ్చాం- తప్పేమిటి?"

"అవునండి. రెండు లక్షల సొమ్ము ఈ జన్మ క్కాదు. మరో రెండు జన్మలు టైం యిస్తాను-మీరు సంపాదించగలరా?" అంది భార్య ఆ మధ్యవయస్కున్ని బలపరుస్తూ.

"ఇది అన్యాయం-ఈ డబ్బు అరగదు" అన్నాడు భర్త.

"అది మాకూ తెలుసు. అందుకే పదివేలు చెక్కు రాసి, ఆ తిరపతి హుండీలో పడేసి మరీ వచ్చేం-" అంది భార్య.

"నేనెలా తలెత్తుకు తిరగ్గలను?" అన్నాడు భర్త.

"తిరక్కూడదు. ప్రభుత్వ లెక్కల్లోనూ, ప్రజల దృష్టిలోనూ నువ్వు అమరజీవివి" అన్నాడు మేన మామ.

"నేను బతికుండగానే నువ్వు వైధవ్యం అనుభ విస్తావా?" అని భార్యను ఎగతాళి చేశాడు భర్త.

"ఆ కర్మ నాకేంలేదు. చెక్కు మార్చుకొని, డబ్బు తీసుకొని కాశీ వెళ్ళిపోదాం. అక్కడ మారు పేరుతో బతుకుదాం. ఈమాత్రం వుద్యోగం అక్కడ దొరక్క పోదు. మీరూ ఏదోకాస్త హిందీ వెలగబెట్టారుగా, హైస్కూల్లో!"


"అవున్నా కనకం! నా మాట విను. ఈ మామూలు గుమస్తా గిరితో ఈ ఇద్దరు ఆడపిల్లలకీ పెళ్ళిళ్ళు ఎలా వెయ్యగలవ్? ఆ భగవంతుడు అలా పంపించాడు. లక్ష్మీదేవి ఇలా వచ్చింది. వద్దనకు-రేపే మీరు కాశీ బయల్దేరండి. ఈ సంగతి నలుగురుకీ తెలియక ముందే, మీరు వెళ్ళిపోతే మంచిది" అన్నాడు మేనమామ వెళ్ళి పోతూ.

అటు భార్య-ఇటు మేనమామ. ఎవరినీ కాదనలేక పోయాడు ఆ ఎస్.కె.రావు. అలాగే ఆలోచిస్తూ వుండి పోయాడు.

"సార్! ఈ 15 నంబరు అంత్య క్రియలు సార్?" అన్నాడు అసిస్టెంట్.

"అవును. వెయ్యాలి" అంటూ అతనితో వెళ్ళాడు. భక్తిగా అంత్యక్రియలు పూర్తిచేశాడు. తిరిగి వస్తూ అధికారి-






"ఏమయ్యా! శర్మా! మనం ఎంత పుణ్యాత్ముల మయ్యా! పదిహేను అనాథ ప్రేతలకు సంస్కారం చేసి, పదిహేను కుటుంబాలను 'ద్విలక్షాధికారుల'ను చేశాం- ఈ జన్మకి ఈ పుణ్యం చాలయ్యా- ప్రమోషన్ రాక పోయినా పర్వాలేదు" అన్నాడు గర్వంగా, తృప్తిగా.

"పుణ్యం బాగానే వుందండి- ఈ పుణ్యం సంగతి చెబితే, బియ్యంవాడు అరువు యివ్వడండి. పాలవాడు పాలు పొయ్యడండి. అయినా, సార్! వచ్చేదాకా వచ్చి నట్టు పనిచేసే మనల్నికాదని, ఈ వచ్చినాళ్లకి బహుమతులు ఇవ్వడం నాకిష్టంలేదు సార్" చాలా ఘాటుగా చెప్పినా వినయంగానే అన్నాడు అసిస్టెంట్.

"అదీ నిజమే అనుకో. అవును మనం ఈ రాత్రి బండికి బయల్దేరి పోదాం. నీ సామాను సర్దేసి రెడీగా వుండు" అన్నాడు అధికారి.

"నాకు సామానేంవుందండి? ఒక్క చేతి సంచీ- నేనిప్పుడు కూడా రెడీ-" అని లోపలకు వెళ్లబోతూ, ఏదో ఏడుపు వినబడగా, వెనక్కి వచ్చాడు.

కొంచెం దూరంలో వున్న ఓ ముసలాయననూ, ఆయనతో వచ్చిన ఆయన కూతుర్నీ చూసి వారిదగ్గరకు వెళ్ళాడు.

"ఏవండీ! ఏం కావాలి?" అని అడిగాడు.

"మా అల్లుడు ఈ ఎలక్షన్ డ్యూటీలో పోయాడని తెల్సింది బాబూ. ఇది నా కూతురు. దీని పేరు సీత, అతని పేరు ఎస్.కె.రావు."

"ఎస్.కె.రావు అంటే సరిపోదండీ- నేనూ ఎస్.కె.రావునే. రుజువులు కావాలి" అన్నాడు అధికారి అప్పుడే వారి దగ్గరకు వస్తూ.

ఏం రుజువులు చెప్పాలో అని సందేహిస్తున్నాడు ముసలాయన.

"చూడండి. పదిహేను శవాలు దొరికాయి. వాటిని బట్వాడా చేసేశాం- 'మరణ కానుకలు'గా ఇచ్చేశాం. ఇప్పుడు మేం ఏంచేయలేం- ఇలాంటి [illegible] కాస్త ముందు రావాలండీ- ఈసారికి వెళ్ళండి. మళ్ళీ సారికి చూసుకుందాం-" అని మందలించి అధికారి లోపలకు వెళ్లిపోయాడు.

"అయితే మాకు 'మరణ కానుక' లేదాండీ?" అన్నాడు ముసలాయన.

"లేదు. లేదంటే లేదు. మరీ అంతగా అడిగితే, మీరు ప్రభుత్వాన్ని మోసంచేసి, డబ్బు తీసుకోడానికి వచ్చారని మీ మీద కేసు పెట్టగల్ను జాగ్రత్త!" అని హెచ్చరించాడు.

"పోనీ, ఆ మృతదేహాన్ని చూడొచ్చాండీ?" అని ప్రాధేయపడింది భార్య.

"అదెక్కడుందమ్మా తల్లీ? దాన్ని సంస్కారం చేసి, వచ్చాం. ఈ తడిబట్టలు, ఈ అవతారం చూస్తే తెలియడం లేదూ?"

"మరణకానుక పోతే పోయే, కనీసం ఆఖరి చూపైనా దక్కలేదు" అని బాధగా కదిలాడు ఆ ముసలాయన కూతుర్నీ, ఇద్దరు మనవరాళ్లనీ తీసుకుని. ●

subscribe for

**SOVIET PERIODICALS**

| | | Sub.for 3 Yrs |
|---|---|---|
| SOVIET UNION (English, Urdu, Hindi) | Monthly | Rs. 50 |
| SOVIET WOMAN (English, Hindi) | " | Rs. 45 |
| Sport In the USSR (English) | " | Rs. 50 |
| Sputnik " | " | Rs. 80 |
| Misha (Children's Magazine) " | " | Rs. 60 |
| Soviet Literature " | " | Rs. 55 |
| Soviet Film " | " | Rs. 55 |
| International Affairs " | " | Rs. 55 |
| Science in USSR " | By Monthly | Rs. 70 |
| New Times " | Weekly | Rs. 40 |
| Moscow News " | " | Rs. 40 |
| Soviet Land " | Fortnightly | Rs. 35 |
| Soviet Land (Urdu and Indian Lang.) " | " | Rs. 30 |

Free Gift: MULTI COLOURED 3 YEARS WALL CALENDAR
Please send your subscription by M.O/cash/D.D. to:

**VISALANDHRA PUBLISHING HOUSE**
4-1-435, Bank street, Hyderabad-500 001. Phone: 46846

**VISALANDHRA BOOK HOUSE**
*Hyderabad, Hanumakonda, Vijayawada, Guntur, Tirupati, Visakhapatnam, Anantapur.*

